క్లుప్తంగా

విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్‌లో ప్రత్యేక శిక్షణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ కురగల్లులోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో శుక్రవారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఒకేషనల్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఆంటోని రాజు, ఒకేషనల్ టీచర్ పి.ఝాన్సీ పాల్గొని, మాట్లాడారు. తమ పాఠశాలలో ఒకేషనల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు 150 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు అందజేశారని, ఈ ఎడ్యుకేషన్ టూర్ కారణంగా ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానంపై మరింత అవగాహన పెంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, కల్యాణి, సరోజ, రాజశేఖర్‌రెడ్డి, సుష్మ లత పాల్గొన్నారు.

ప్రియదర్శిని అధ్యాపకుల సాయం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి ప్రియదర్శిని కళాశాల అధ్యాపకులు శుక్రవారం ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు నగదు చెక్కును అందజేశారు. కళాశాల అధినేత చందు రామారావు, సెక్రటరీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల వల్ల ఎంతో మంది ప్రజలు నిరాశ్రయులయ్యారన్నారు. వారిని ఆదుకునేందుకు అధ్యాపకులు తమ ఒక రోజు వేతనం మొత్తం రూ.2 లక్షలను సహాయార్థం అందజేసినట్లు చెప్పారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



తాడికొండ: మండలంలో రెండు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు శుక్రవారం అండర్ -14 -17 విభాగాల్లో వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించారు. విజేతలను ఎంపిక చేశారు. మండల కో-ఆర్డినేటర్ వై.రాజారెడ్డి, పీఈటీలు సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, గురుస్వామి, జగదీష్ రెడ్డి, అజయ్, నాగయ్య, అనీల్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి పథకాలు అందేలా కృషి



ఫిరంగిపురం: ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందేలా సిబ్బంది కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలా లక్ష్మీకుమారి చెప్పారు. మండలంలోని 113తాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు ఇంటింటికి తిరిగి అందజేశారు. ప్రభుత్వ ప్రగతిని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సత్యానంద్, ధర్మరాజు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పరిసరాల శుభ్రత గురించి వివరించారు. ఇంటితోపాటుగా చుట్టు పక్కల ఉన్న పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఇంటిలో నీరు నిల్వ ఉన్న గాబులు పరిశీలించి, నీటిని పారబోయించారు. ప్రతి నాలుగు రోజులకోమారు మంచి నీరు నిల్వ ఉన్న బిందెలు, గాబులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

తాగునీటి కటకట

- చెడిపోయిన మోటార్లు
- పది రోజులుగా నీటి సరఫరాకు అంతరాయం
- అర్ధరాత్రిళ్లు నీటి సరఫరా
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళలు
- పట్టించుకోని అధికారులు



గుంటూరు చానల్ వద్ద తాగునీటి పథకం

మంగళగిరి: పట్టణ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజులుగా తాగునీటి సరఫరాలో అంతరాయంతో ఏర్పడుతోంది. తాగునీటి పథకం మోటార్లు మరమ్మతులకు గురికాగా అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మోటార్లు మరమ్మతులు చేపడుతున్నప్పటికీ మళ్లీ రిపేర్లు వస్తున్నాయి. దీంతో వేళాపాల లేకుండా నీటిని సరఫరా చేస్తున్నారు. అర్ధరాత్రి వేళ తాగునీరు వస్తుండటంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కొత్త మోటార్లు బిగించి, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కమిషనర్ అలీమ్ బాషా



పారిశుద్ధ్యం చేపట్టిన కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యం బాగుటుందని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని కాళి మాత గుడి వద్ద, తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్ నగర్ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. తాడేపల్లి డోలాస్ నగర్ నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అక్టోబర్ 2 వరకు జరుగుతుందని తెలిపారు. వార్డులో ఆరోగ్య సంరక్షణ సేవలు, బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణ, మందుల పిచికారీ, చెత్త దంపులు తొలగించడం, మొక్కలు నాటి వాటిని పెంచడం, ఉన్న పార్కులను శుభ్రం చేయడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. విద్యుత్, నీరు ఆదాతో పాటు, ప్లాస్టిక్ నిరోధంపై అవగాహన కల్పిస్తూ, తాగునీరు పరిశుభ్రంగా ఉంచేందుకు వాటర్ ట్యాంకులు క్లీనింగ్, క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సల్ కళాశాలలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మేడికొండూరు: రక్తదానం ప్రాణ దానంతో సమానమని పల్మనాలజిస్ట్ డాక్టర్ పటేల్ అతీఫ్ సయ్యదామీన్ అన్నారు. మండలంలోని డోకిపర్రు యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం గుంటూరు సెయింట్ జోసెఫ్ జనరల్ హాస్పిటల్ ఆధర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. డాక్టర్ పటేల్ అతీఫ్ సయ్యదామిన్ మాట్లాడుతూ విద్యార్థులు, వైద్యుల పర్యవేక్షణలో రక్తదానం చేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఫాదర్ పి.బాలస్వామి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడి రక్తం అందగా ఎంతోమంది మరణిస్తున్నారని, రక్తదానంతో అలాంటి వారికి ప్రాణదానం చేసినట్లవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కోటిరెడ్డి, సెయింట్ జోసెఫ్ జనరల్ హాస్పిటల్ రక్తదాన విభాగపు ఇన్‌చార్జ్ సిస్టర్ సెల్విరాణి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నూతక్కి రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.మర్రెడ్డి, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువులు




ర్యాలీలో పాల్గొన్న కౌన్సిలర్ అనిత, మలేరియా అధికారులు

తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులు అని 16వ వార్డు కౌన్సిలర్ దివి అనిత పేర్కొన్నారు. మలేరియాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చినరావూరు తోట, వైకుంఠపురం కాలనీలో వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. చిన్నదోమ పెనుప్రమాదమని, అవికుడితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు.తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. శుక్రవారం రోజు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల రామప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయనే ఒక నట విశ్వవిద్యాలయం

ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో మా-ఏపీ అధ్యక్షుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా పక్కన కొత్త సుబ్రహ్మణ్యం, రత్నాకర్

తెనాలి: ప్రముఖ సినీనటుడు నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని మా-ఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలపాటి నగర్‌లోని రత్న ఫార్చ్యూన్ కల్యాణమండపంలో జరిగిన వేడుకలకు మా-ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. ఆ మహానటుడిపై శతజయంతి రోజున పోస్టల్ స్టాంపు విడుదలపై హర్షం ప్రకటించారు. ప్రతి పాత్రకు ప్రాణం పోసిన మహానటుడు అక్కినేని నాగేశ్వరరావని ఆయన కొనియాడారు. నటనలో అక్కినేని ఒక నట విశ్వవిద్యాలయంగా ఆయన అభివర్ణించారు. తాగుబోతులను, ప్రేమలో ఓడిపోయిన వ్యక్తులను దేవదాసుగా కొందరు నేటికీ అంటున్నారంటే, ఆపాత్రలో అక్కినేని నటన ఎవరెస్ట్ అంత ఎత్తులోను, మహా సముద్రమంత వైశాల్యంలో ఉండటమే కారణమన్నారు .దేవదాసు,ప్రేమాభిషేకం, మాయాబజార్, మేఘసందేశం సినిమాలు తెలుగు చలనచిత్ర సీమలో చెరగని ఆస్తి అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన పర్సనాలిటీకి తగిన పాత్రలనే ఎంపిక చేసుకొని ఆయా పాత్రలకు నూరుశాతం న్యాయం చేసినందునే అక్కినేనిని పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు వరించాయని చెప్పారు. దర్శకుడు రత్నాకర్, నటుడు వెలగా సుభాష్ చంద్రబోస్, మిలటరీ ప్రసాద్,రావూరి సురేష్ బాబు, బెల్లంకొండ వెంకట్, కొండముడి జయకర్, డాక్టర్ భూషణం, రమణయ్య, బసవయ్య పాల్గొన్నారు. ముందుగా అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొనండి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, 39వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గెడ్డేటి ఝాన్సీవాణి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 39వ వార్డులో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో పర్యటిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలు, రోడ్లను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

– తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తెనాలిని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో పలువురు మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్కూల్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పద్య కవులకు సన్మానం

ఫిరంగిపురం: గుర్రం జాషువా 129వ జయంతిని పురస్కరించుకొని కొండవీడు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పద్య కవులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ రఫి, ప్రధాన కార్యదర్శి తోళ్ల మడుగు గోవిందయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిరంగిపురంలోని రూరల్ క్రిస్టియన్ జూనియర్ కళాశాలలోని ఆడిటోరియంలో సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు పద్య కవులను సన్మానిస్తామని తెలిపారు.

సాక్షి విలేకరికి బెదిరింపు

మంగళగిరి: టీడీపీ సోషల్ మీడియా కన్వీనర్ బరితెగించి సాక్షి దినపత్రిక విలేకరిపై దౌర్జన్యానికి దిగాడు. మంగళగిరి పట్టణంలోని కళా వేదికలో శుక్రవారం కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ' ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం కవరేజీకి సాక్షి మంగళగిరి విలేకరి ఐ.వెంకటేశ్వరరెడ్డి వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న టీడీపీ సోషల్ మీడియ కన్వీనర్ కరీం వ్యతిరేక వార్త రాస్తే ఊరిలో కూడా ఉండవు, ఇంటికి వచ్చి కొడతాను అంటూ పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడాడు. కొట్టేందుకు యత్నించాడు. విలేకరి బయటకు వెళ్తుండగా మళ్లీ బయటకు వచ్చి ఇష్టానుసారం దుర్భాషలాలాడాడు. వార్త వస్తే చంపేస్తా అంటూ బెదిరించాడు.

కొబ్బరి బొండాలు రహదారులపై వేయొద్దు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: కొబ్బరి బొండాలను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. పట్టణంలోని కొబ్బరి బొండాల వ్యాపారులతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంట కొబ్బరి బొండాలు పెట్టుకునే వారు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

ఖాతాదారుల ఆదరణతో బ్యాంకు పురోగమనం



మాట్లాడుతున్న డీఎల్ కాంతారావు

తెనాలి: ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ, తెనాలి 23 వసంతాలుగా సభ్యులు, ఖాతాదారుల ఆదరణతో పురోగమిస్తోందని సొసైటీ ఛైర్మన్ డీఎల్ కాంతారావు వెల్లడించారు. సొసైటీ ఆధ్వర్యంలో ది కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రస్తుతం 10 శాఖలతో నడుస్తూ 2023-24 సంవత్సరానికి రూ.533 కోట్ల టర్నోవర్‌తో రూ.2.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు చెప్పారు. ఈనెల 22వ తేదీన సర్వసభ్య సమావేశం సందర్భంగా శుక్రవారం సొసైటీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మొత్తం డిపాజిట్లు రూ.117 కోట్లు కాగా, రుణాలు రూ.114 కోట్లు ఉన్నట్టు తెలిపారు. తనఖా రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలను ఇస్తుండగా, డిపాజిట్లపై జాతీయ బ్యాంకులకన్నా అత్యధికంగా డిపాజిట్లపై 11 శాతం వడ్డీని అందిస్తున్నామని తెలిపారు. బంగారు రుణాలపై 13 శాతం, ఇళ్లు, ఇళ్లస్థలాల హామీపై, వ్యక్తిగత జామీనుపై 15 శాతం వడ్డీతో రుణాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. రుణాల మంజూరు, రికవరీలోనూ అగ్రగామిగా ఉండటం గర్వకారణమన్నారు. వీరితో సొసైటీ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, దావూరి చక్రధర్ చౌదరి ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ఎం స్కూల్‌లో క్రీడా పోటీలు



త్రో బాల్‌ను పరిశీలిస్తున్న నిర్వాహకులు



పరుగు మొదలెట్టిన విద్యార్థులు

తెనాలిఅర్బన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన క్రీడల పోటీలను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసూనదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం త్రోబాల్, పరుగు పందెం, జంపింగ్ వంటి పోటీలను నిర్వహించారు. 25 మంది వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగే పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు చెప్పారు. శనివారం వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెనాలి మండల కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఎఎస్.నాగిరెడ్డి, పీఈటీలు రవీంద్ర, భాస్కర్, రమేష్, హరనాథ్, శివశంకర్, గోవింద్, గోవర్ధన్, నాగమణి, మానస, హెప్సిబా, శిరీష, బేగం, సాంబ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఇరుక్కుపోయిన లారీ!

తెనాలిఅర్బన్: వైకుంఠపురం రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. మిక్సర్ లారీ బ్రిడ్జికి వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లకు తగలడంతో వాహనం నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ సుమారు గంటపాటు నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే తెనాలి నుంచి పెదరావూరు వైపు మిక్సర్ లారీ వెళ్తుంది. వైకుంఠపురం బ్రిడ్జి దాటగానే ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్ల కంటే లారీ ఎత్తుగా ఉండటంతో డ్రైవర్ వాహనాన్ని నిలిపివేశారు. ఇంతలో వెనుక నుంచి అనేక వాహనాలు వచ్చి అక్కడ నిలిచిపోయాయి. మిక్సర్ లారీ ముందుకు వెనుక వెళ్ళ లేక అక్కడే నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది.

'మణిపాల్'కు ఎన్ఏబీహెచ్ డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్



సర్టిఫికెట్ అందుకుంటున్న డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణం మహానాడు ప్రాంతంలోని మణిపాల్ హాస్పిటల్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్ గోల్డ్ లెవల్ లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ గౌరవాన్ని అందుకున్న మొదటి, ఏకైక ఆసుపత్రిగా మణిపాల్ హాస్పిటల్ నిలిచిందన్నారు. భారతదేశంలోని మొదటి 100 ఆసుపత్రులలో ఒకటిగా మణిపాల్ నిలిచిందని చెప్పారు. రోగి డేటా ఇప్పుడు పూర్తిగా డిజిటల్‌గా రికార్డ్ చేయబడి, అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఏ సమయంలో అయినా రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు. తద్వారా తిరుగులేని సంరక్షణ సమన్వయాన్ని నిర్ధారిస్తుందని తెలిపారు. ఈ డిజిటల్ హెల్త్ రికార్డుల కారణంగా బీమా క్లెయిమ్‌ల ప్రక్రియ వేగంగా ట్రాక్ చేయగలమన్నారు. ఎన్ఏబీహెచ్ డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్‌ను అవార్డును స్వీకరించిన వారిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉత్తమ్ శర్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ వసంత, ఐటీ లీడ్ జహీద్ హుస్సేన్ తదితరులు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో క్వాలిటీ లీడ్ డాక్టర్ బి. రమేష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు

ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తెనాలి శ్రావణ్ కుమార్

మేడికొండూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పంచాయతీ, సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు చేయడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామస్తులు సమస్యల ఏకరువు పెట్టడంతో అధికారులు ఉన్నారా..? లేరా..?అని ఎమ్మెల్యే సంబంధిత ఉన్నత అధికారులను ప్రశ్నించారు. తహసిల్దార్ కె.కల్యాణి, ఎంపీడీఓ ప్రభాకర్ రావు, ఏపీవో కిరణ్మయి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, తాడిగిరి శివరామయ్య, తాలూరి పోతురాజు, గ్రామ సర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ శివన్నారాయణ, నార్నే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆరుద్ర భూలక్ష్మి, ఎంపీపీ షేక్ జబీన్

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి విచ్చేశారు. మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో స్త్రీ శక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 60 రోజుల పాటు శిక్షణ పొందిన 63వ బ్యాచ్ మహిళలు 50 మందికి కుట్టు మిషన్లు అందజేశామని చెప్పారు. రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీ దేవి మాట్లాడుతూ కుటుంబంలో మహిళ పాత్ర చాలా కీలకమని, స్వయం ఉపాధి సాధించడం ద్వారా కుటుంబం ఆర్థికంగా నిదొక్కుకుంటాయన్నారు. ఈ ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ స్త్రీ శక్తిని నెలకొల్పి, శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల పార్టీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత, దుగ్గిరాల ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, గుంటూరు పార్లమెంట్ తెలుగు మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఉన్నం ఝాన్సీరాణి, అలేఖ్య పాల్గొన్నారు.